
సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 31 । జనవరి । 2025



మన్యంలో.. 'గజ' ఘీంకారం..!

గజరాజుల ఘీంకారాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రజల ప్రాణాలు, పంటలు, ఆస్తులకు రక్షణ కరువైంది.

- 8లో



బంగారం చోరీ

పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో మూడు తులాల బంగారం చోరీ జరిగింది.

- 8లో



కొరియా పల్లెల్లో ఒడిశా పోలీసుల జులుం

- 8లో

కొరియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు.

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్ నిలుపుదల

పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పూర్తయ్యేవరకు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిలుపుదల చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీతో ముగుస్తుందన్నారు. అప్పటివరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. పీజీఆర్ఎస్‌లో వినతులు అందజేసేందుకు రావద్దని కోరారు.

నిన్న బాధ్యతలు.. నేడు ఉద్యోగ విరమణ



అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.నాగేశ్వరి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అదనపు ఎస్పీగా ఉన్న డాక్టర్ ఓ.దిలీప్‌కిరణ్‌కి ఏసీబీ, విజయవాడ బదిలీ అయ్యింది. 1989 సంవత్సరంలో ఎస్ఐగా ఖమ్మంలో బాధ్యతలు చేపట్టిన ఎల్.నాగేశ్వరి 36 సంవత్సరాలుగా విధి నిర్వహణలో పదోన్నతులు పొందుతూ 3 నెలల కిందట అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. తన సర్వీసులో తొలిసారి అదనపు ఎస్పీగా మన్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉద్యోగ విరమణ సమయం జనవరి 31, 2025 కావడంతో జిల్లాలో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. జిల్లాలో రెండు రోజులు అదనపు ఎస్పీగా విధులు నిర్వహించిన వ్యక్తిగా ఆమె పేరుపొందనున్నారు.

వ్యవసాయ విజ్ఞానానికి 'కేవీకే' దోహదం



విద్యార్థులకు కేవీకే సేవలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): రైతులకు వ్యవసాయ విజ్ఞానం అందించేందుకు కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) ఎంతగానో దోహదపడుతుందని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు కేవీకేను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, వ్యవసాయ విద్యార్థులకు కేవీకే అందజేస్తున్న సేవలను వివరించారు. అనంతరం కేవీకేలోని వర్మీకంపోస్ట్ యూనిట్లు, పుట్టగొడుగుల యూనిట్, పౌల్ట్రీ షెడ్లు, చిరుధాన్యాల యూనిట్ తదితర వాటిని చూపించారు.

హడ్డుబంగి పాఠశాల సందర్శన

సీతంపేట: హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ మల్లిక, తదితరులు ఉన్నారు.

కారును ఢీకొట్టిన జేసీబీ

- మోదవలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి



నారుపేట సమీపంలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న కారు, (ఇన్‌సెట్లో) మృతి చెందిన అప్పలనాయుడు

పూసపాటిరేగ: భోగాపురం మండలం నారుపేట సమీపంలో గురువారం రాత్రి కారును జేసీబీ ఢీకొన్న ప్రమాదంలో మోదవలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోని అప్పలనాయుడు దుర్మరణం చెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డెంకాడ మండలం మోదవలసకు చెందిన బోని అప్పలనాయుడు (51) భోగాపురం నుంచి రాజాపులోవ వైపు తన కారులో వెళ్తుండగా నారుపేట సమీపంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న జేసీబీ ఢీకొంది. కారు డ్రైవింగ్ సీటులో ఉన్న అప్పలనాయుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. భోగాపురం ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేశారు.

పచ్చమూకల కర్ర పెత్తనం..!



- ప్రభుత్వ కార్యాలయాల్లో కూటమి 'ఛోటాబ్యాచ్'లు హల్‌చల్!
- సిబ్బందిపై జులుం.. చెప్పిన పని చేయాల్సిందే..
- అధికారులు సైతం ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి, వారికే రాచమర్యాదలు
- మండలాల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు, ఎంపీపీలకు దక్కని గౌరవం
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న ప్రజాప్రతినిధులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

రాష్ట్రంతో పాటు జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోతున్నారు. వారిని కాదని... కనీసం ఒక వార్డు మెంబరు కూడా కాని 'తమ్ముళ్లు' అంతా తామై నడిపిస్తున్నారు. అధికారులపై స్వారీ చేస్తున్నారు. వారు చెబితేనే గ్రామంలో ఏ పనైనా.. లేకుంటే అధికారుల మీద పైస్థాయి నుంచి ఒత్తిడి తీసుకొస్తున్నారు. పంచాయతీల తీర్మానం లేకుండానే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఏకపక్షంగా సాగిపోతున్న విషయం విదితమే. 'ఛోటా బ్యాచ్' చెప్పిన దానికల్లా అధికారులు సైతం తలాడిస్తున్నారు. ఒక వేళ ఎవరైనా వినకుంటే.. బదిలీకి సిద్ధపడిపోవాల్సిందే. ఎమ్మెల్యేలు, మంత్రుల స్థాయి నుంచి కూడా ఒత్తిడి వస్తుండటంతో తమకెందుకు సమస్య అని అధికారులు రాజీపడిపోతున్నారు. 'పచ్చ బ్యాచ్' చెప్పిన పనికల్లా జీ హుజూర్ అంటున్నారు.

కక్షసాధింపు పాలన.. కోర్టు మెట్లెక్కిన సర్పంచ్‌లు

ప్రభుత్వపరంగా చేపట్టిన ఏ పనికైనా పంచాయతీలో సర్పంచ్ తీర్మానం ఉండాలి. ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్‌లకు, ఎంపీపీలకు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆహ్వానం చేయాలి. ప్రస్తుతం కూటమి పాలనలో అందుకు భిన్నంగా సాగుతోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో.. ఏ ఒక్కరినీ పిలవడం లేదు. పిలిచినా అగౌరవపరుస్తున్నారు. ఇటీవల జరిగిన పల్లె పండగ పనులకు సర్పంచ్‌లను నామమాత్రంగా పిలిచి.. వారు రాకముందే కొబ్బరికాయ కొట్టేసిన ఘటనలు అనేకం. ఏ అధికారమూ లేని కూటమి కార్యకర్తలు దర్జాగా వేదికపైకి ఎక్కి, అంతా తామై వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌లకు, ఎంపీపీలకు తెలియకుండానే 'తమ్ముళ్ల' ఆదేశాలతో ఏపీవోలు, ఎంపీడీవోలు నడిపించేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు పాలన వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. సాలూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో 29 గిరిశిఖర పంచాయతీలకు రహదారులు మంజూరయ్యాయి. ఇప్పుడు ఆ పనులన్నింటినీ కూటమి నాయకులు రద్దు చేయిస్తున్నారు.
- సాలూరు మండలం బోరబందలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రహదారులు, కాలువ పనులు మంజూరైతే రాజకీయ దురుద్దేశంతో నిలుపు చేయించారు. పోనీ కూటమి నాయకులైనా చేస్తున్నారా అంటే అదీ లేదు. వారూ చేయడం లేదు.. తమనూ చేయనీవ్వడం లేదని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.
- ఇదే మండలం పురోహితునివలసలో రూ.15 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులు మంజూరైతే వాటినీ రద్దు చేయించారు.
- కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లకు తెలియకుండానే అధికారుల సహకారంతో 'తమ్ముళ్లు' అభివృద్ధి పనులు చేయించేసుకుంటున్నారు. పంచాయతీల తీర్మానం కూడా లేకుండా పనులు చేయిస్తున్నారని, ఇది సర్పంచ్‌ల హక్కులకు భంగం కలిగించడమేనని సాలూరు మండలంలోని పారన్నవలస, శివరాంపురం, పెదపథం పంచాయతీల ప్రజాప్రతినిధులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

తమవారి కడుపు నింపేందుకు మేట్‌ల 'ఉపాధి' కొట్టి..

తమ కార్యకర్తలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కూటమి నేతలు ఉపాధిహామీ పథకం మేట్‌ల ఉసురు పోసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న వారిని వివిధ కారణాలతో తొలగించి.. ఆ స్థానంలో తమవారిని నియమించుకుంటున్నారు. సీతానగరం మండలంలో ఇదే తరహా ప్రయత్నాన్ని ఖండిస్తూ అక్కడ ఎంపీడీవో కార్యాలయం వద్ద వేతనదారులు నిరసన వ్యక్తం చేశారు. కొమరాడ మండలంలోనూ మేట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సాలూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. వాస్తవానికి మేట్లలో ఇరు పార్టీల వారూ ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ వారినే లక్ష్యంగా చేసుకుని, తొలగింపునకు పాల్పడుతున్నారు. మేట్లు, గ్రూపు సభ్యులు కలసి గ్రామంలో కొత్త వారిని ఎన్నుకుందామని చెబుతున్నా 'తమ్ముళ్లు' వినడం లేదు. మండల కార్యాలయంలోనే కూర్చొని జాబితా తయారు చేసేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై అధికారులను ప్రశ్నిస్తే.. పై నుంచి ఒత్తిడి అని చెప్పి తప్పించుకుంటున్నారని పలువురు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

> సీతంపేట, భామిని మండలాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని.. ఆయా మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇటీవల సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రెండు మండలాల పరిధిలో 90 శాతం మందికిపైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. వీరెవరికీ అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం అందించడం లేదు. ఒక వేళ పిలిచినా.. కనీస గౌరవం ఇవ్వడం లేదు. వార్డు మెంబరు కూడా కాని కూటమి ఛోటా బ్యాచ్ వారే దర్జాగా వేదికపై కూర్చొని ఆర్డర్లు వేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

> ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం అందడం లేదు. గ్రామస్థాయిలో నిర్వహించే ఏ కార్యక్రమానికీ వ్యవసాయాధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదంటూ ఇటీవల కురుపాం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సాధారణ సర్వ సభ్య సమావేశంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి లేవనెత్తారు.

> 'ఉపాధి హామీలో పని చేస్తున్న మేట్ పోస్టులపై కూటమి తమ్ముళ్ల కన్నుపడింది. తమ కార్యకర్తలకు 'ఉపాధి' కల్పించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే ఉన్న పాత వారిని తొలగిస్తున్నారు. ఈ తరహాలోనే సీతానగరం మండలంలో నిడగల్లులో పాత మేట్‌లను తొలగించే ప్రయత్నంపై పలువురు వేతనదారులు మండల పరిషత్ కార్యాలయం వద్ద మూడు రోజుల కిందట ధర్నా చేపట్టారు.'

> 'ఇటీవల సాలూరు మండలంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఓ వ్యక్తి హంగామా సృష్టించాడు. సిబ్బందిని దుర్భాషలాడి, కుర్చీని కాలితో తన్ని, టేబుల్‌పై గట్టిగా చరుస్తూ, అందరి అంతూ తేలుస్తానని బెదిరించాడు. 'మా ప్రభుత్వం అధికారంలో ఉంది. మంత్రితో చెప్పి ఉద్యోగాలు ఊడగొట్టిస్తా..' అని హెచ్చరించాడు.'

'బడిదేవర' తవ్వకాల అనుమతులపై ఆగ్రహం

- అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం
- ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా



ఏపీఓ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బడిదేవర కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మూడడ్ల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం అడవితల్లి విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి దేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని, కొండ పరిసర ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. కొండపై గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన చోట మైనింగ్ తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు.

ఐటీడీఏ అధికారులు గిరిజనులకు రక్షణగా ఉండాలని కోరారు. తవ్వకాలకు కనీసం అభిప్రాయ సేకరణ కూడా చేపట్టలేదన్నారు. అక్కడి గిరిజనులు, రైతులు బడి దేవరమ్మ కొండను దేవతగా కొలుస్తారని పేర్కొన్నారు. అడ్డగోలుగా తవ్వకాలకు అనుమతులిచ్చి వ్యవసాయం, పర్యావరణం, గిరిజన బతుకులు నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం ఏపీఓ మురళీధర్, ఏఓ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం నేత బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీను నాయుడు, ఉయక ముత్యాలు, ఎం.భాస్కరావు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం పి.సంఘం, ఏపీ రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, సీపీఐ నాయకులు తోట జీవన్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు పోలా రమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పాల మెట్ట రాము, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు నారాయణపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

మరియగిరి.. భక్త సిరి



కొండపై పూజలందుకుంటున్న మేరీమాత

- మరియమ్మను దర్శించుకున్న భక్తజనం
- దివ్యబలిపూజలు చేసిన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి విజయకుమార్



దివ్యబలి పూజలో పాల్గొన్న వివిధ చర్చిల ఫాదర్లు



దివ్యబలిపూజలో పాల్గొన్న ఆరాధకులు



మరియమ్మా... కాపాడమ్మా...

వీరఘట్టం: శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మరియమాత జాతర గురువారం వైభవంగా సాగింది. వీరఘట్టం సమీపంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మరియమ్మకు శ్రీకాకుళం మేత్రాసనం పీఠాదిపతి రాయరాల విజయకుమార్ సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. మేరీమాత స్తోత్రం వినిపించారు. ఓ తల్లీ మరియా.. మమ్మల్ని కాపాడమ్మా అంటూ ప్రార్థించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 40వేల మంది భక్తులు దివ్యబలిపూజలో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా కొండపైకి నడుచుకుంటూ వెళ్లి మేరిమాతను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కొత్తగా ఏర్పాటుచేసిన మేరీమాత విగ్రహాన్ని శ్రీకాకుళం బిషప్ విజయ్‌కుమార్, నెల్లూరు బిషప్ ఆంథోనిరాజ్ ఆవిష్కరించారు. వీరఘట్టం, చిట్టపుడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురుమండలాల్లో ఇటీవల నిర్వహించిన బైబిల్ పోటీలు,ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాలకొండ డీఎస్పీ ఎం. రాంబాబు ఆధ్వర్యంలో పాలకొండ సీఐ చంద్ర మౌళి పర్యవేక్షణలో వీరఘట్టం, సీతంపేట, దోను బాయి, చినమేరంగి ఎస్ఐలు బందోబస్తు విధులు నిర్వహించారు. పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. జాతరలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

గిరిజన వర్సిటీ తొలిదశ నిర్మాణాలు.. ఏప్రిల్ నాటికి పూర్తిచేస్తాం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



గిరిజన యూనివర్సిటీ స్థలం వద్ద విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

దత్తిరాజేరు: మెంటాడ–దత్తిరాజేరు మండలాల మధ్యలోని చినమేడపల్లి గ్రామం వద్ద 561 ఎకరాల్లో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలిదశ పనులు ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వర్సిటీ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని ఎస్ఈ లక్ష్మణరావుతో కలిసి చూశారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్, తాగునీరు సరఫరా, రోడ్ల నిర్మాణం, తదితర మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడే తరగతులు నిర్వహించేలా ఏప్రిల్‌లో కొన్ని తరగతి గదులను ప్రారంభిస్తామన్నారు. పరిపాలన భవనం, జీ ప్లస్–2, బాలుర వసతి గృహం, జీ ప్లస్–7 అంతస్తుల నిర్మాణాలను వేగవంతం చేశామని, 2027 నాటికి అన్ని భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వర్సిటీ అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. మరడాం వద్ద ఉన్న 420 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు విద్యుత్ పంపిణీ జరగాల్సి ఉందని, గిరిజన విద్యాలయం ప్రాంగణం నుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్లేందుకు వీలుగా పది ఎకరాల వర్సిటీ స్థలాన్ని కేటాయించాలని ట్రాన్స్‌కో అధికారులు కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వానికి కేటాయించిన స్థలం ఇవ్వడం కుదరదని, విద్యుత్ కేంద్రం పక్కన ఉన్న కొండపై నుంచి పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన యూనివర్సిటీ ఏఓ డాక్టర్ ఎస్.వి.సూర్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు, బొబ్బిలి ఆర్డీఓ మోహన్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ బాలాజీ, ప్రాజెక్టు విభాగం ఎస్ఈ నరసింగరావు, ఏడీఏ మన్మథరావు, తహసీల్దార్ విజయభాస్కర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బటన్ ఎందుకు నొక్కలేకపోతున్నారు బాబూ..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస: సంక్షేమ పథకాలను డీబీటీ విధానంలో జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి అందజేస్తున్నారని... బటన్ నొక్కడం పెద్ద విషయమా తమ్ముళ్లా... మూలనున్న ముసలమ్మ కూడా బటన్ నొక్కగలదని ఎన్నికల్లో పదేపదే హేళన చేసిన చంద్రబాబు.. ఇప్పుడెందుకు బటన్ నొక్కలేకపోతున్నారని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఎద్దేవా చేశారు. సూపర్‌– 6 ఇవ్వలేం అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేదా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం, 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ కూటమి నేతలు హామీలిచ్చి... గెలిచాక ఆ హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనిస్తున్నారన్నారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నించినా.. అడిగినా తప్పుడు కేసులు పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపరుస్తారని తెలిసి ప్రజలు మౌనంగా ఉన్నారని, తగిన సమయంలో చంద్రబాబుకు బుద్ధి చెబుతారన్నారు. సంక్షేమ పథకాలు, హామీల అమలుపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శరత్, సర్పంచ్ రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లబ్ధిదారులను ఎంపిక చేయాలి



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: జీవనోపాదులకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఐటీడీఏలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎటువంటి జీవనోపాది పథకాలు పొందకుండా ఉన్న వారు అర్హులన్నారు. ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులు పరిశీలించి వారిలో అర్హులుంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం రమణ పాల్గొన్నారు.

బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సంతోషి

పార్వతీపురం టౌన్: మూడు తులాల బంగారం చోరీ జరిగిన సంఘటన పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో చోటు చేసుకుంది. పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షిర్డీసాయి నగర్‌కు చెందిన బి.రమాదేవి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 28న శంబర పండగ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. పండగ అయిన తర్వాత బుధవారం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చేసరికి వెనుక తలుపు తీసి ఉండడంతో అనుమానంతో బెడ్ రూమ్‌లో చూసేసరికి బీరువా తెరచి ఉంది. బీరువా నుంచి మూడు తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై తనిఖీలు



పట్టణంలో రేషన్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్న పౌర సరఫరాల శాఖ సిబ్బంది

విజయనగరం అర్బన్: రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్రమ నిల్వలు ఉన్నట్లు గుర్తించిన రెండు రేషన్ దుకాణాలపై 6ఏ కేసులను నమోదు చేసినట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మధుసూధనరావు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని మరో రేషన్ దుకాణంపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



చాపాన రామారావు మృతదేహం

గజపతినగరం : మండల కేంద్రం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం మెంటాడ మండలం జయతి గ్రామానికి చెందిన చాపాన రామారావు (44) రాయగడ నుంచి గజపతినగరం వైపు రైలులో బుధవారం ప్రయాణం చేసి గజపతినగరం రైల్వేస్టేషన్‌లో దిగాడు. రాత్రంతా తన స్వగ్రామానికి వెళ్లకుండా గజపతినగరం రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉంటూ శుక్రవారం ఉదయం మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఆయనకు ఎటువంటి గాయాలు లేవని అనారోగ్యంతో మృతి చెందినట్లు సహజ మరణంగా గుర్తించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

మన్యంలో.. గజ ఘీంకారం..!



తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

- నాగావళి, వంశధార, జంఝావతి నదీతీరాల వెంబడి గజరాజుల తిష్ట
- తరచూ పంటలు, ఆస్తులు, ప్రజల ప్రాణాలకు నష్టం
- 3,500 ఎకరాల్లో పంటలకు దినదిన గండం
- రూ.కోట్లలో నష్టాలు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న మన్యం జిల్లా ప్రజలు
- ఎన్నికల ముందు గజరాజుల తరలింపునకు వాగ్దానం చేసిన కూటమి నేతలు



ఇటీవల భామిని మండలం ఘనసర వద్ద ఎమ్మెల్యే, అధికారుల ముందు బైఠాయించిన బాధిత రైతులు(ఫైల్)

పాలకొండ రూరల్/భామిని: మన్యం జిల్లాలో గజరాజుల ఘీంకారాలు నిత్యకృత్యమయ్యాయి. వీటి సంచారంతో ప్రజలు తమ ప్రాణాలు, పంటలు, ఆస్తులు కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. అడవుల రూపు కోల్పోతుండడంతో ఏనుగుల మనుగడ కష్టమై జనావాసాల వైపు దూసుకు వస్తున్నాయి. ఆహారం కోసం పంట పొలాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో సాగు పొలాలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఫలితం దక్కడం లేదు. మరోవైపు ఆస్తులు, ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఎన్నికల ముందు ఏనుగుల తరలింపుపై కూటమి నేతలు స్పష్టమైన హామీలిచ్చి...నేడు వాటిని మరవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి పరీవాహక ప్రాంతాల వెంబడి గజరాజులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిని కట్టడి చేసే క్రమంలో అధికారిక యత్నాలు ఆశించిన ఫలితం ఇవ్వడం లేదు. దీంతో బాధిత గ్రామాల ప్రజలు తమకు పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలని అటు ప్రజాప్రతినిధులను, ఇటు అధికారులను కోరుతున్నారు.

గ్రామాల్లో కునుకు కరువు

జిల్లాలో సువిశాలంగా విస్తరించి ఉన్న ఏజెన్సీ, నాగావళి, వంశధార, జంఝావతి నదీతీర పరివాహక ప్రాంతాల వెంబడి గజరాజుల గుంపులు తిష్ట వేసాయి. పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట పరిసరాల్లో నాలుగు ఏనుగులు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తున్నాయి. పార్వతీపురం రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలో కురుపాం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో నిత్యం సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపు అక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులు సేద్యం చేస్తున్న అరటి, బొప్పాయి, మొక్కజొన్న, చెరకు, వరి, పామాయిల్, కర్బూజ, మామిడి, జీడి పంటలతో పాటు ఇతర ఆహార, వాణిజ్య పంటలను నాశనం చేస్తున్నాయి. జిల్లా పరిధిలో సుమారు 3,500 ఎకరాల మేర పంటలు ఏనుగుల సంచారంతో తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రూ.కోట్లలో నష్టం సంభవిస్తున్నా... ఇందుకు సంబంధించిన పరిహారం నేటికీ అందించలేదు.

కుంకీ ఏనుగులు ఎక్కడ?

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనుగుల సమస్యను అధిగమించేందుకు తాము కట్టుబడి ఉన్నామని కూటమి నాయకులు బహిరంగ సభల్లో వెల్లడించారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాడు కుంకీ ఏనుగులు తీసుకువస్తామన్నారు. వాటి సహాయంతో ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపులు తరలింపునకు చర్యలు చేపడతామన్నారు. నేటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీ జంతి కొండ వద్ద ఎలిఫ్యాంట్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వ పెద్దల హామీలపై బాధితుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరణ మృదంగం

గజరాజుల సంచారంతో గడిచిన కొద్ది సంవత్సరాల్లో 13 మంది మృత్యువాత పడ్డారు. 12 పశువులు మృతి చెందినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీటితో పాటు వ్యవసాయ బోర్లు, పంపు షెడ్లు, పరికరాలను, డ్రిప్ పైపులను నాశనం చేసాయి.

పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలి...

ఇటీవల పాలకొండ నియోజకవర్గం భామిని మండలం ఘనసర వద్ద ఏనుగుల కారణంగా రైతులు నష్టపోయిన పంటలను అంచనా వేసేందుకు వచ్చిన అటవీ శాఖ అధికారుల వద్ద బాధిత రైతులు తీవ్రంగా స్పందించారు. తరచూ నష్టాల అంచనాలు నమోదు చేయడం తప్ప చేసేదీ ఏమీ లేదంటూ నినాదాలు చేసారు. తమకు పరిహారం వద్దని, శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, ఎమ్మెల్యే జయకృష్ణను చుట్టుముట్టారు. బైఠాయించి నిరసన తెలిపారు.

రెండెకరాల్లో జొన్న పంట నాశనం



నా సొంత భూమితో పాటు మరో ఎకరా భూమిని కౌలుకు తీసుకుని రెండెకరాల్లో మొక్కజొన్న సేద్యం చేపట్టాను. అప్పులు చేసి మదుపులు పెట్టాను. కుటుంబమంతా కష్టపడ్డాం. కీలక దశలో ఏనుగుల గుంపు దాడి చేయటంతో పూర్తిగా పంట నష్టపోయాను. నష్టపోయిన పంటను చూసేందుకు పొలంకు వెళ్లాలన్నా భయం వేస్తుంది. ఏ క్షణం ఏనుగులు దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటున్నాం. నష్ట పరిహారాలు ఎందుకు? ఈ ప్రాంతం నుంచి వాటిని తరలిస్తే మేలు.

– వలరౌతు లక్ష్మీనారాయణ, రైతు, ఘనసర, భామిని మండలం

నిరంతరం నిఘా

ఏనుగుల కదిలికలపై మా సిబ్బంది నిరంతరం దృష్టి సారిస్తున్నారు. అవి సంచరించే పరిసరాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు గుచ్చిమి వద్ద ఏర్పాట్లు చేపట్టనున్నాం. ఇందుకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు వచ్చాయి. రూ.5 కోట్లతో సోలార్ కంచె, ట్రెంచులు, వెదురు వనాలు, నీటి సంపులు, ఇతర వసతులు ఏనుగుల కోసం సిద్ధం చేయాలని నిర్ణయించాం. తొలి దశలో రూ.కోటి నిధులుతో పనులు చేపడతాం. పంట నష్టాలకు సంబంధించి దాదాపు మూడు వేల మంది రైతులకు రూ.45లక్షలు వరకు జమ చేశాం. రెండు మూడు రోజుల్లో సదరు రైతుల ఖాతాకు ఈ మొత్తాలు పూర్తిగా జమ కాబడతాయి. కుంకీ ఏనుగులను తీసుకువచ్చే విధంగా అడుగులు పడుతున్నాయి.

– జీపీఏ ప్రసూన, అటవీ శాఖాధికారిణి

ఏనుగులు మళ్లీ వచ్చేశాయ్...

జియ్యమ్మవలస: మండలంలోని జోగిరాజుపేట, బట్లబద్ర, కన్నపుదొరవలస, వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలోకి గురువారం సాయంత్రం ఏనుగులు మళ్లీ వచ్చాయి. రాత్రి పూట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచించారు. ప్రస్తుతం జోగిరాజు పేట వద్ద ఉన్నాయని, రాత్రి సమయానికి బిత్రపాడు, బాసంగి తదితర పంట పొలాలలోకి వచ్చే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



గుచ్చిమి వద్ద స్థల పరిశీలన చేస్తున్న జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన

యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పురుషుల జట్టుకు ఎంపిక



కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు సభ్యులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పంజాబ్ గురుకాశీ యూనివర్సిటీలో వచ్చే నెల 11 నుంచి 18వ తేదీ వరకు జరిగే అఖిల భారత అంతర్ యూనివర్సిటీ విద్యాలయ కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు పోటీలలో పాల్గొనే జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) యూనివర్సిటీ జట్టులో సీతం ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జేఎన్‌టీయూ జీవీలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీలలో కళాశాల క్రీడాకారులు ప్రతిభ చూపారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీరఘట్టం: మండలంలోని సీఎస్పీ రహదారిలో నడిమికెల్ల–కడకెల్ల గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.శంకరరావు అనే వ్యక్తికి కాళ్లు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఈయన గరుగుబిల్లి మండలం నవిరి గ్రామం నుండి బైక్‌పై పాలకొండ వైపు వెళుతుండగా వెనుక నుండి బైక్ వచ్చిన ఓ వ్యక్తి శంకరరావు నడుపుతున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రుడు శంకరరావును 108 వాహనంలో పార్వతీపురం తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బైక్‌ను వదిలేసి పరారయ్యాడు. ప్రమాద స్థలంలో ఉన్న రెండు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

సంపద సృష్టించేదెప్పుడు.. పథకాలు ఇచ్చేదెప్పుడు?

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి



మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస: నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం, నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు.. సంపద సృష్టించాకే.. సంక్షేమం అమలు చేస్తామని నిసిగ్గుగా చెప్పుకోవడం శోచనీయమని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఇటీవల నీతి ఆయోగ్ నివేదికపై ప్రజంటేషన్ కార్యక్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పుడు ఇవ్వలేం.. అని చంద్రబాబు మరోసారి చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. ఇదే విషయమై జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగిలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన పథకాలు ఇస్తున్నప్పుడు రాష్ట్ర శ్రీలంక అయిపోతుందని దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎన్నికల సమయంలో రాష్ట్ర బడ్జెట్‌ను మించిపోయేలా సూపర్ సిక్స్ హామీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించి, ఓట్లు వేసుకుని ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఇప్పుడు ఆయన ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేనని చెప్పడం మోసమేనన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు తమ వద్ద ఓ మంచి ప్రణాళిక ఉందని, అవి అమలుచేయకపోతే కాలర్ పట్టుకుని అడగొచ్చని చంద్రబాబు, లోకేషలు చెప్పారని గుర్తు చేశారు. ఎలాగైనా కూటమి ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూస్తానని పవన్ కల్యాణ్ కూడా చెప్పారన్నారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులు రూ.14 లక్షల కోట్లు అని తప్పుడు ప్రచారం చేశారని, అయితే ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేవలం రూ.3,33,513 కోట్లు మాత్రమే అప్పులంటూ ఆర్థికమంత్రి ప్రకటించారన్నారు. ప్రస్తుత చంద్రబాబు సర్కారు కేవలం ఏడు నెలల్లో లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిందని, ఆ డబ్బులతో ప్రజలకు ఏం మంచి చేశారో చెప్పే ధైర్యం ఉందా అని నిలదీశారు. సీఎం హోదాలో మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు.. డీఎస్సీ అభ్యర్థులకు కనబడకుండా తిరుగుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

పూసపాటిరేగ : మండల కేంద్రం భోగాపురం గంగరాజు చెరువులో ఓ వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. భోగాపురానికి చెందిన పసుపులేటి వెంకటేష్ (21) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం ఎంతకూ నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం దక్కలేదు. గురువారం ఉదయం భోగాపురం గంగరాజు చెరువులో శవమై తేలాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు భోగాపురం ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్

విశాఖ స్పోర్ట్స్:

రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విశాఖ రీజియన్ జట్లు సత్తా చాటాయి. 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పోటీపడగా చిత్తూరు, కృష్ణా రీజియన్ జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌కు పోటీపడ్డాయి. బాలికల వాలీబాల్ పోటీలో విశాఖ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్(విశాఖ) విజేతగా నిలవగా బాలాజీ పాలిటెక్నిక్(గజపతినగరం) రన్నరప్ సాధించింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్(విశాఖ) కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు గురువారంతో ముగిశాయి. బహుమతి కార్యక్రమానికి వీపీటీ ప్రిన్సిపాల్, మీట్ కన్వీనర్ కె.నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములను స్వీకరిస్తూనే నేర్చుకోవాలని హితబోధ చేశారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సాంకేతిక విద్యా శాఖ కాకినాడ ఆర్జేడీ జె.సత్యనారాయణ, తిరుపతి ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, మీట్ కో కన్వీనర్ బి.జానకిరామయ్య, జీబసీఈ ప్రిన్సిపాల్ కేవీ రమణ పాల్గొన్నారు. పీడీలు అబ్బాస్, కమాల్, వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా సాంకేతికవిద్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

హాస్య కథల పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

విజయనగరం అర్బన్: హాస్యల కథల పోటీలకు రచయితల నుంచి ఎంట్రీలను పట్టణానికి చెందిన అభినందన సేవా సంస్థ ఆహ్వానిస్తోంది. ఈ మేరకు పోటీల నియమ నిబంధనలను ఆ సంస్థ కార్యదర్శి వి.నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పోటీల ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.2,500, రూ.2 వేలు, రూ.1.500లు నగదు బహుమతులు ప్రకటించారు. మరో మూడు కథలకు రూ.500 వంతున కన్సొలేషన్ బహుమతులు ఇవ్వనున్నారు. కథలు రెండు పేజీలకు మించరాదు. చేతిరాతతో కానీ, టైపు చేసినవైనా కానీ పోస్టు ద్వారానే పంపాల్సి ఉంటుంది. కథ ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కాలేదని, ఎందులోనూ పరిశీలనలో లేదని తెలియజేస్తూ రచయిత హామీ పత్రాన్ని విధిగా కథతో జత చేయాలి. కథలు పంపాల్సిన చిరునామా 'డాక్టర్ సి.రామలక్ష్మి, 60–12–6, జీ–3, బ్యాంక్ కాలనీ–2, మొగల్‌రాజాపురం, విజయవాడ–520010, ఫోన్:6302738678'కు పంపాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకం

- కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి
- ఉత్తమ ఫలితాల కోసం పంచతంత్ర ప్రణాళికపై సమీక్ష



కేజీబీవీ ప్రిన్సిపాళ్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేజీబీవీ రాష్ట్ర సెక్రటరీ డి.దేవానందరెడ్డి

విజయనగరం అర్బన్: కేజీబీవీల్లో బాలికలకు విద్యాబోధనలు అందించడంతో పాటు వాళ్ల మానసిక వికాసాన్ని పెంపొందించడానికి ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది తల్లిదండ్రుల తమ వంతు పాత్ర బాధ్యతగా నిర్వహించాలని కేజీబీవీ స్టేట్ సెక్రటరీ డి.దేవానందరెడ్డి అన్నారు. కేజీబీవీ నిర్వహణపై ప్రిన్సిపాళ్లతో స్థానిక కేజీబీవీలో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పది, ఇంటర్ వార్షిక పరీక్షల ఉత్తమ ఫలితాల కోసం చేపట్టిన పంచతంత్ర ప్రణాళిక పనితీరును తొలిత కేజీబీవీల వారీగా ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్‌గా నిర్వహిస్తున్నందున బాలికల అన్ని విధాల అభివృద్ధి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆరో తరగతి నుంచి బేసిక్స్ బోధనలు అందించడంలో శ్రద్ధ తీసుకుంటే పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధ్యం సులువవుతాయని అన్నారు. కేజీబీవీల పరిసరాల పరిశుభ్రంతో పాటు ఆహార పదార్థాల నాణ్యత పాటించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ యు.మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, జీసీడీఓ పి.మాలతి, అసిస్టెంట్ జీసీడీఓ కె.గాయత్రి, జిల్లాలోని 26 కేజీబీవీల ప్రిన్సిపాళ్లుపాల్గొన్నారు.

కొఠియా పల్లెల్లో ఒడిశా పోలీసుల జులుం

- భయాందోళనలు చెందుతున్న ఆంధ్రా అధికారులు, సిబ్బంది
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

సాలూరు:

ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. అడపాదడపా వివాదాలు తరువాత చాలా కాలం స్తబ్దుగా ఉన్న ఒడిశా యంత్రాంగం రాష్ట్రంలో ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మళ్లీ తనదైన శైలిలో పాత బాణీని ప్రదర్శిస్తోంది. ఇటీవల జరిగిన ఓ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒకటైన గంజాయిభద్ర పంచాయతీలో దిగువశెంబిలో అంగన్‌వాడీ కేంద్రంలో తెలుగులో ఉన్న చార్ట్‌లు, బోర్డులను ఒడిశా పోలీసులు తీసుకువెళ్లిపోయారు. ఈ నెల 27న సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో సుమారు పది మంది ఒడిశా పోలీసులు అప్పటికే మూసివేసిన అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వచ్చారు. తెలుగులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం బోర్డును బయట ఉంచరాదని, కేంద్రంలో దాచుకోవాలని చెప్పి కొంత దూరం వెళ్లారు. మళ్లీ ఏమైందో తెలియదుగాని మళ్లీ గ్రామంలోకి వచ్చి బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించారు. తెలుగులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం బోర్డును, కేంద్రంలో తెలుగులో రాసి ఉన్న చార్ట్‌లు తదితర సామగ్రిని తీసుకువెళ్లిపోయారు. ఇవి కావాలంటే కొఠియా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ క్రమంలో ఆంధ్రా తరఫున అంగన్‌వాడీ కేంద్రం నడపడానికి ఇల్లు ఎందుకు ఇచ్చారని పోలీసులు ఒడియా భాషలో ఇంటి యజమానికి ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, సూపర్‌వైజర్లు, సీడీపీఓ విజయలక్ష్మికి చెప్పగా బుధవారం గ్రామానికి అంగన్‌వాడీ అధికారులు వెళ్లి విచారణ జరిపారు. విచారణ నివేదికను ఐసీడీఎస్ పీడీ కార్యాలయ అధికారులకు గురువారం అందజేసారు.



ఒడిశా పోలిసులు బోర్డులు, చార్టులు తీసుకువెళ్లిన నేపథ్యంలో దిగువశెంబిలో విచారణ చేస్తున్న అంగన్‌వాడీ అధికారులు

చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

ఈ సంఘటన జరిగిన నేపథ్యంలో కొఠియా గ్రూపు గ్రామాల్లో పని చేసేందుకు ఆంధ్రా అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. తరచూ ఒడిశా పోలీసులు అక్కడ విధి నిర్వహణకు వెళ్లే ఆంధ్రా అధికారులు, సిబ్బందిని అడ్డుకోవడం వంటి పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో స్టేటస్ కో అమల్లో ఉన్నప్పటికీ ఒడిశా పోలీసులు జులుం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని స్థానిక గిరిజనులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు రాష్ట్రంలో బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం, అటు ఒడిశాలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరిన నేపథ్యంలో దశాబ్దాల ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఆంధ్రా కూటమి నేతలు ఏ మేరకు చిత్తశుద్ధితో అడుగులు ముందుకు వస్తారో వేచి చూడాల్సి ఉంది. కొఠియా గ్రూపు గ్రామాల వివాదమున్న ఈ సాలూరు నియోజకవర్గానికి రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఈ వివాదానికి ఎలా ఫుల్‌స్టాప్ పెడతారో వేచి చూడాలి.